
# నాకు నచ్చిన నా కథ



"వైదేహి"

7-2-1979 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురించబడిన నా కథ "ఆకలికి అన్నం" నేను వ్రాసిన కథలలో నాకు బాగా నచ్చింది. కేవలం ఏదో వ్రాశామనిపించుకోవడంకంటే, వ్రాసింది పాఠకుల హృదయాలలో పది కాలాల పాటు నిలిచిపోయేదిగా వుండాలన్నది నా తాపత్రయం. అందుకే పాఠకులకీ కథ ప్రఖ్యాత మాసపత్రిక 'యువ' ద్వారా అందించాలన్నది నా ప్రయత్నం.

సాటి మనిషిలోని ఆకలిబాధను అర్థం చేసుకోలేనివాళ్ళు మానవత్వంలేని మనుష్యులు. వాళ్ళనుగురించే ఈ కథ.

# ఆకలికి అన్నం

అప్పుడే కాఫీతాగి కుర్చీలో కూర్చుంటున్నాను. అటెండర్ రంగయ్య టపాల్ ప్యాడ్ విప్పి నా ముందుంచాడు.

"ఈరోజు టపాల్ ఇంటికెందుకు తెచ్చావు?" అతన్ని చూస్తూ అడిగాను నేను.

"ఈ రోజు సెలవు, సార్. తమరు ఆఫీసుకు రారనుకున్నాను," రంగయ్య జవాబిచ్చాడు.

"సెలవెందుకని?"

"ఈ రోజు కృష్ణాష్టమి, సార్!"

"ఏమిటోనోయ్, ఈ గానుగెద్దు చాకిరికి అలవాటుపడిన తర్వాత ఏది సెలవురోజో, ఏది పనిరోజో తెలియడంలేదు. మన గుమాస్తాలెవరూ ఆఫీసుకు రారంటావా?" అడిగాను నేను టపాల్‌లోని ఒక్కొక్క కాగితమే చూస్తూ.

"అవసరమైన పని ఉంటే వస్తారు, సార్." రంగయ్య నేను చూసేసిన ఒక్కొక్క కాగితం తన చేతిలోకి తీసుకొంటూ జవాబిచ్చాడు.

కాలింగ్‌బెల్ మ్రోగింది. రంగయ్య చేతిలోని కాగితాలు పేపర్‌వెయిట్ కింద పెట్టి వీధిలోకి వెళ్ళాడు.

"ఇదేం ధర్మసత్రం అనుకున్నావా? వెళ్ళవయ్యా! ఇది ఆఫీసరుగారిల్లు" నిమిషం తర్వాత రంగయ్య గొంతు పెద్దగా వినిపించింది.

"ఏమిటి రంగయ్యా?" నేను టపాల్ చూడటం నిలిపి అడిగాను.

"మరో ముష్టివాడు. వారాలు ఏర్పాటుచేసుకోడానికి వచ్చాడు, సార్!" అదే స్థాయిలో అరిచాడు రంగయ్య.


రంగయ్య సమాధానంతో నా మనస్సు చివుక్కుమంది. దిగ్గున లేచి వాకిట కెళ్ళాను. ఒక పదహారేళ్ళ కుర్రాడు దీనంగా నిల్చునివున్నాడు. నేను వాళ్ళిద్దరివద్ద కెళ్ళడంతోనే రంగయ్య పక్కకు తప్పుకొని నిల్చున్నాడు.

"ఎవరు, బాబూ?" నేను అనునయంగా అడిగాను.

"నేను తల్లి, తండ్రి లేని అనాథను, సార్. మొన్నటివరకు నా మేన మామ పంచన ఉండి చదువుకున్నాను. నా దురదృష్టం - ఆయన కూడా కాలం చేశాడు. వారానికొక ఇల్లు భోజనాని కేర్పాటు చేసుకొని, నా చదువు పూర్తిచేసు కోవాలనుకుంటున్నాను. అందుకే మీవంటి దయగల పెద్దల వద్ద కొస్తున్నాను." ఆ కుర్రాడు చెప్తుంటే నా గతం నా కళ్ళముందు మెదిలింది.

"అలాగే. నీకు అనుకూలమైన రోజున వచ్చి మా ఇంట్లో భోజనంచేసి వెళ్ళు. నీకింకా వారంలో రోజులు మిగిలిపోయి ఉంటే, అవి కుదిరేవరకు మా ఇంట్లోనే భోజనం చెయ్యవచ్చు.... రంగయ్యా, ఇత నెప్పుడు వచ్చినా అన్నం పెట్టాలి" అన్నాను నేను.

అతను కృతజ్ఞతగా నమస్కరించాడు.




అతన్ని లోపలికి తీసుకొచ్చి నా భార్య దమయంతికి చూపించాను.

అత వెళ్ళిపోయాడు.

నేను కుర్చీలో కూర్చున్నానే గాని బుద్ధి టపాలుమీదకు వెళ్ళడంలేదు. నా గతమే నా కళ్ళముందు మెదలసాగింది.

ఆ రోజుల్లో నూనే అదేపరిస్థితుల్లో ఉండేవాడిని. నాకు తండ్రి ఎలా ఉంటాడో తెలియదు. నేను భూమిమీద కళ్ళుతెరవడం, అతను కన్ను మూయడం ఒకేసారి జరిగాయి. తెల్పిన తల్లి నాకు ప్రపంచాన్నిగురించి ఏమీ తెలియకముందే నా పదవఏట వెళ్ళిపోయింది. నా భవిష్యత్తును గురించి ఏం చెయ్యాలో తెలియని స్థితిలో ఉన్నాను కొంతమంది ఎక్కడైనా ధనవంతులఇంట పనులకాపరిగా చేరమన్నారు. కొందరు ఫ్యాక్టరీలో కూలిపనికి వెళ్ళమన్నారు. కానీ నా కవేవీ ఇష్టంలేదు. ఎలాగైనా కష్టపడి చదువుకోవాలి. మంచి ఉద్యోగం సంపాదించా లన్నది నా కాంక్ష. భగవంతుడు శక్తికిమించి కోరిక లెందుకిస్తాడో అప్పుడు అర్థంకాకపోయినా ఇప్పుడర్థమవుతోంది. మనకు శక్తిని సంపాదించుకోడానికని పూళ్ళోని ప్రతి ఇల్లు తిరిగి వారాలు కుదుర్చుకున్నాను. ఒక్క ఆదివారం మాత్రం మిగిలిపోయింది. ఆ వారంకోసం ఒక ధనవంతుల ఇంటిముందుకు వెళ్ళి నిల్చు న్నాను. ఆ ఇల్లు, ఆ ఇంటిలోని మనస్తత్వాలు నేను జీవితంలో ఎన్నటికీ మర్చి పోలేను. నాలుగురోడ్ల కూడలిపక్కన ఆధునాతనంగా నిర్మించబడి ఉందా ఇల్లు.

వాకిటముందు పెద్ద గేట్ ఉంది. ఆ గేటుముందు నిల్చుని ఆ ఇంటిలో నివసిస్తున్న వాళ్ళంతా ఎంత అదృష్టవంతులో అనుకున్నాను. వాళ్ళంతగా కాకపోయినా భగవంతుడు తనకూ కొంత ఆర్థికపరిస్థితి కల్పించకూడదా? ఏమిటీ దీనావస్థ? అయినా అందవిదానికి అర్రులుచాచట మేమిటిలే అనిపించింది. అలో చనలమధ్య ఎంతసేపు గడిపానో నాకు తెలియదు గానీ, ఒక కుర్రాడు వచ్చి నా ముందు నిల్చునేవరకూ నేనీ ప్రపంచాన్నే మరిచిపోయాను.

"ఎవరు కావాలి?" ఆ కుర్రాడు అడిగాడు. అతనికి దాదాపు నా వయస్సే ఉంటుంది.

"మీ పెద్దవాళ్ళతో మాట్లాడాలి." నేనన్నాను.

"ఏం, నేను పెద్దవాడిలా కనిపించటంలేదా?" ఆ కుర్రాడు అడిగాడు. అతని కంఠంలో అహంకారం ఉంది.

"నీవూ నా అంత వాడివే. నీవు పెద్దవాడివెలా అవుతావు?" నేను తమాషాగా నవ్వుతూ అడిగాను.

"వోహో! నేను నీకంత చిన్నవాడిగా కనిపిస్తున్నానా? సరే వచ్చిన పనేమిటో చెప్పు." నడుములమీద చేతులువేసుకొని ఠీవిగా నిల్చుని అడిగాడతను.

"మీ నాన్నగారితో మాట్లాడాలి, బాబూ. నేను వారాలు కుదుర్చుకొని చదువుకుంటున్నాను. మీ ఇంట్లో ఒక వారం ఇస్తారేమో అడగడానికొచ్చాను."

"అడుక్కు తినడాని కొచ్చినవాడివి నీకింత బెట్టా? ఆ మాట నన్నే అడగవచ్చుగా? మా నాన్నదాకా ఎందుకు?"

"పోనీ, ఇప్పుడు చెప్పానుగా. మీ పెద్దవాళ్ళతో చెప్పి నాకు ఒక వారం ఇప్పిస్తావా?" అడిగాను నేను ఆశగా.

ఇంతలో అతని స్నేహితు డొకడొచ్చాడు అక్కడికి.

"ఏమిటి?" వాడి భుజంమీద చేయివేసి అడిగాడు.

"వీడెవ్వడో భిచ్చమెత్తుకోవడానికొచ్చాడు. ఆ అడగడంలో కూడా పెద్దస్థయిలు పడుతున్నాడు." నాకేసి హేళనగా చూస్తూ బదులిచ్చాడా కలవారి అబ్బాయి.

"వాడితో మాటలేమటిరా? నాలుగు తన్ని తరమక" అన్నాడు స్నేహితుడు.

అంతే. అతను నన్ను కొట్టడానికి ముందుకొచ్చాడు. నా కింకేమీ లేకపోయినా పౌరుషం మాత్రం మెండుగా ఉంది. అనవసరంగా నాపైకి వస్తున్న అతనిమీదకు లంఘించాను.వాడు నామీద చేయివేసుకునేంతలోనే, వాడి చెయ్యి

మెలేసి వెనక్కునెట్టాను. నేనలా చేయడం వరండాలోనుండి వాళ్ళ తండ్రి చూచినట్లుంది. అతను వెనకపాటుగా వచ్చి నన్ను పెడరెక్కలు వంచిపట్టి తను తెచ్చి వరండాలోని స్తంభానికి కట్టేసి, అతని కొడుకుచేత చెంపలమీద కొట్టించాడు. ధనవంతుల జులుం ఎలా ఉంటుందో అప్పుడర్థమైంది నాకు. నాకు చెప్పుకోడానికొక్కడా ఎవ్వరూ లేరు. వాళ్ళు నన్ను అలా హింసించి, అరగంట తర్వాత వదిలేశారు. చెంపలు బాగా వాచిపోయాయి. ఆకలికి అన్నం పెట్టకుండా మానేరు. ఎందుకంతగా హింసించారు? నేను వాళ్ళ అబ్బాయిచేత దెబ్బలు తినకుండా తప్పించుకున్నందుకేనా? ఏ దిక్కూ లేనివాడను గనుక, ఒక అరుగుమీద పడుకుని నాలో నేను ఏడ్చుకున్నాను. అయితే భగవంతుడు నన్ను కరుణించాడు. నాకు దయామయులైన వ్యక్తుల్ని చూపించాడు. వాళ్ళందరి సహాయంతో నేను చదువుకున్నాను. పెద్దవాడినయ్యాను. డెప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగం సంపాదించగలిగాను. అందుకే నాకు అనాథలంటే అపరిమితమైన జాలి. నాకు భగవంతుడు శక్తినిచ్చినందుకు, నా చేతనైనంతవరకు అనాథలకు సాయంచేయాలని నిశ్చయించుకున్నాను. అలాగే చేస్తున్నాను.

నా ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ మళ్ళీ కాలింగ్‌బజర్ మ్రోగింది. రంగయ్య వాకిటకెళ్ళాడు. రెండు నిమిషాలలో తిరిగివచ్చాడు.

“మున్సిపల్ కౌన్సిలర్‌గారు తమర్ని కలుసుకోవాలని వచ్చారు, సార్!” అన్నాడు రంగయ్య.

“లోపలికి రమ్మను.”

నా మాట బయట ఉన్న కౌన్సిలర్‌గారికి వినిపించినట్లుంది.

“నమస్కారం, సార్!” అంటూ లోపలికొచ్చారు.

“కూర్చోండి” అన్నాను నేను.

ఆయన నా ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుని, చేతనున్న ఇన్విటేషన్ కార్డుల కట్టవిప్పి ఒక కార్డు తీసి నా కందిస్తూ, “సార్! ఈ రోజు కొత్తగా చార్జి తీసుకున్న మునిసిపాలిటీ సెక్రెటరీగారికి చిన్న పార్టీ ఇస్తున్నాను. మీరు తప్పక రావాలి” అన్నాడు కౌన్సిలర్.

నా కిలాంటి పార్టీలకు వెళ్ళడం ఇష్టంలేదు. సాధ్యమైనంతవరకు తప్పించుకుంటుంటాను. సభ్యతకోసం ఆ కార్డు అందుకున్నాను.

“నాకు క్యాంప్ ఉంది.... రాలేను.” ముక్తసరిగా అన్నాను.

"అలా అంటే కుదరదు, సార్! మీరు ఛార్జి తీసుకొని రెండు నెలలైంది. ఇప్పటికి మిమ్మల్ని చాలాసార్లు ఆహ్వానించాను. కానీ మీరు రాలేదు. ఈసారి మాత్రం నేను వదిలిపెట్టను. సాయంత్రం కారు పంపిస్తాను" అన్నాడాయన.

"అంతపని చేయకండి. నే నెలాగో వస్తాను" అన్నాను నేను అభ్యంతరం తెలుపుతూ.

"తమరి సంగతి నాకు బాగా తెలుసు సార్! సాయంత్రం మీ రెక్కడ ఉన్నా మా కారు వచ్చి లాక్కెళ్ళుతుంది" అని వెళ్ళిపోయాడు కౌన్సిలర్.

నేను సందిగ్ధంలో పడ్డాను. వెళ్ళడమా? మానడమా? ఆ సమస్యకు అంత ప్రాధాన్యం ఇవ్వటమెందుకులే అని సరిపెట్టుకున్నాను. నా కార్యక్రమంలో నిమగ్నమైపోయాను.

సాయంత్రం ఏడుగంటలకే కౌన్సిలర్‌గారి కారు వచ్చి మా ఇంటిముందాగింది. నేను విధిలేక అందులో కూర్చున్నాను. కారు వచ్చి కౌన్సిలర్ ఇంటి ఆవరణలో ఆగింది. కారు దిగడంతోనే నా కెదురువచ్చి నమస్కరించారు కౌన్సిలర్.

కానీ నా మస్తిష్కం పూర్తిగా మొద్దుబారిపోయింది.

అందుకు కారణం.... నా చిన్నతనంలో నన్ను కట్టివేయబడి, హింసించబడిన స్తంభం నా కళ్ళెదుట ఉంది.

ఆ రోజు ఆకలితో ఇదే వాకిటకొచ్చాను. అన్నం పెట్టకపోగా నన్ను అవమానించి పంపించాడు ఆ చిన్ననాటి కౌన్సిలర్. కాగా ఈరోజు నేనొక డెప్యూటీ కలెక్టరు హోదాలో ఉన్నాను గనుక, నాకు ఆకలి లేకపోయినా తన్ను బలవంతంగా వాళ్ళింటికి తీసుకొచ్చాడు. ఇందుకు కారణం నావద్ద తన పలుకుబడిని పెంచుకోవాలన్న స్వార్థం. ఆకలిబాధను అర్థంచేసుకొని అన్నంపెట్టలేని వాళ్ళింటి అన్నం తింటే కడుపునొప్పి వస్తుంది. అందుకే నాకు భోజనం చెయ్యక ముందే హఠాత్తుగా కడుపునొప్పి వచ్చింది. పొట్ట నొక్కుకుంటూ, ముఖం చిట్లించి, ఆహ్వానించిన కౌన్సిలర్‌కు, కొత్తగా చేరిన మునిసిపాలిటీ సెక్రటరీ గారికి "సారీ!" చెప్పి తిరోగమించాను.

